# విశ్వగీతి



సి. ఆనందారామం

అలలై తేలి....ఆశలుగా అల్లుకొని .... అందరినీ అందాలను మెరిపిస్తూ మురిపిస్తూ ప్రాణికోటిని పరుగులెత్తించే మధురసుధాస్రవంతి మోహనమూర్తి మురళీగాన రవళి....

ఆ స్వరాలకు సమ్మోహితులై, ఆ నాద ఝరిలో కొట్టుకొనిపోతున్నారు సామాన్య గోపికలు.... ప్రణయపారవశ్యాన తాము పెట్టిన పరుగులన్నీ లౌకిక పరిసరాలను దాటించలేకపోయాయని గుర్తించి నపుడు తెల్లబోయారు; బేలగా తిరిగి వచ్చారు.

మురళీకృష్ణునిలో విశ్వమోహనుని చూసింది రాధ. ఎంతటి సమ్మోహనమూ, స్వస్వరూపజ్ఞానాన్ని తొలగించలేకపోయిందామెకు. అందుకే పరవశించినా, పరుగులలో పాల్గొలేదు. అంతేనేం? ఆమె ప్రగాఢ పారవశ్యమే ఆమెను అన్నింటినుండీ తప్పించింది. దివ్యసౌందర్యంలో ఒక భాగంగా దీపింపచేసింది.

గొల్లున ఏడుపులు.... కేకలు. తన ఆలోచనలలోంచి తెప్పరిల్లింది రాధ. ఎవరినో స్ట్రెచర్‌మీద మోసుకొస్తున్నారు. ఎవరది? కరుణ్! అవును! కరుణ్! తలమీద పెద్ద గాయంతో వంటినిండా దెబ్బలతో....చూడలేక పోయింది. ఇంత ఘోరం ఎలా జరిగింది?

“అబ్బా!”

వెనకనుండి వినబడ్డ కంఠస్వరానికి అదిరిపడింది. గిర్రున తిరిగింది. స్ట్రెచర్‌మీద ఉన్న కరుణ్‌ని చూస్తున్న శేఖర్ చూపులు రాధ చూపులతో కలుసుకున్నాయి. గిరుక్కున క్రిందకు వాలాయి. శేఖర్ ముఖం చూడలేకపోతోంది రాధ. ఆ ముఖంలో ఆమెకు భయంకర పిశాచాల బీభత్స తాండవం కనిపిస్తోంది. కరాళకాళిక వికటాట్టహాసం వినిపిస్తోంది.

“ఆ కరుణ్ అంతుతేలుస్తాను. ఏమనుకుంటున్నాడు? ఎవరితో చెలగాట మాడుతున్నాడు? పీకనొక్కి మురిగ్గుంటలో పారేసినా అడిగే వాడు లేడు”—ఇదే మాటలు....సరిగ్గా ఇదే మాటలు.... శేఖర్‌నోట వినిపించాయి రెండు రోజుల క్రితం .... అప్పుడింత దారుణాన్ని ఊహించలేక పోయింది. మానవ సహజమయిన ఈర్ష్య ఆ మాటలను పలికించిందని భ్రమపడింది. కానీ, శేఖర్ రాక్షసుడయ్యాడని....కాగలడని....అనుమానించలేక పోయింది.

ఒక్కసారి రాధ ముఖంలోకి చూశాడు శేఖర్. మరుక్షణం ఎదురింట్లో ఉన్నాడు. అందరినీ తీసుకొని లోపలికెళ్ళాడు. స్పృహ తప్పిన కరుణ్‌ని తన కారులో పడుకొ బెట్టుకున్నాడు. కారుని హాస్పిటల్ వైపు నడిపించాడు.

చూస్తూ నిలబడ్డ రాధ శరీరం సెగలూ, పొగలూ, కక్కింది. శేఖర్ తనకు బాగా తెలుసు. వల్లమాలిన ఉద్రేకం. ఆ ఉద్రేకంలో ఎంత దారుణంగానైనా ప్రవర్తించగలడు. ఆ తరువాత పశ్చాత్తాప పడతాడు. ఎలాంటి పరిహారమైనా చెల్లించటానికి సిద్ధపడతాడు.... కరుణ్ స్థితికి కారకుడు శేఖర్ కాకపోతే—ఒక్కనాటికీ ఇలా కారులో హాస్పిటల్‌కి తీసికెళ్ళడు.

ఇంటిముందు స్కూటర్ ఆగింది. కల్నల్‌స్వామి దిగాడు. ఉడికిపోతూ కన్నీళ్ళు గ్రక్కుతూ నిలబడ్డ రాధను చూశాడు. “రాధా!” అన్నాడు ఆప్యాయంగా.

“అన్నయ్యా!” అని స్వామి భుజాలమీద వాలిపోయి వెక్కి వెక్కి ఏడ్చేసింది రాధ.

“పాపం! కరుణ్‌ని ఎవరో .... ” గొంతుకేదో అడ్డుపడినట్లయింది రాధకి.

“ఊరుకో! ఊరుకో!” రాధ భుజం తడుతూ ఓదార్పుగా అన్నాడు స్వామి. అయినా రాధ ఊరుకోలేకపోయింది. తనొక సిగరెట్ కాల్చుకుంటూ రాధను యథేచ్ఛగా ఏడవనిచ్చాడు స్వామి.... అలాంటి సమయంలో ఏడవటమే మంచిదేమో!

ఎప్పటికో తిరిగివచ్చాడు శేఖర్. ఉస్సురంటూ కూలబడ్డాడు.

అతనిముఖం చూడగానే అణచుకుంటూన్న దుఃఖం ఒక్కసారిగా పొంగింది రాధలో!

చూసి భరించలేకపోయాడు శేఖర్. "రాధా! ఏడవకు!" అన్నాడు. ఆ కంఠంలో ఓదార్పు లేదు, బొంగురుగా ఉంది. కరుగ్గా ఉంది. రాధ తల ఎత్తలేదు. ఏడుపు ఆపలేదు.

"నీ కన్నీళ్ళు చూడలేను రాధా!" ఈసారి శేఖర్ కంఠం దయనీయంగా వుంది. ప్రాధేయపడుతున్నట్లు వుంది. రాధ మనసు మెత్తబడబోయింది.

"అతనికోసం నీ కంట కన్నీరు కురిస్తే నేను సహించను." అతి గంభీరంగా, ఏదో బెదిరిస్తున్నట్లుగా వుంది అతని కంఠం.

మెత్తబడబోతున్న రాధ మనసు బండబారింది. అహం పడగ విప్పింది....చివ్వున లేచింది.

"ఏవిటీ? నేను ఏడవాలో, ఏడవకూడదో, నిర్ణయించే అధికారం కూడా మీదేనా? నను ఏడిపించే హక్కు మీ ఒక్కరిదేనన్న మాట!" అంది వెటకారంగ కసిగా.

"మరే! నేను నిన్ను ఏడిపిస్తూన్నాను కదూ!" రోషంగా అడిగాడు శేఖర్.

"ఊ! లేదు! ఏడిపించటం లేదు. నా మెడలో అప్పుడెప్పుడో తాళి కట్టినంత మాత్రాన....నా బాబుకి తండ్రి అయినంత మాత్రాన నన్ను కొనుక్కున్నట్లు....నేను మీ బానిస నయినట్లు....ప్రవర్తించటం, ఏడిపించటం కాదు. ఇక్కడ నిలబడకు... అక్కడకుపోకు....ఇటు తల తిప్పకు అటు చూడకు...ఇలా ఏడవకు....అలా నవ్వకు..." అని శాసించటం ఏడిపించటం కాదు...."

ఉద్రేకంతో అంటూ ఆగిపోయి పకాలున నవ్వింది రాధ. అక్కసుగా అంది.

"అవును ఏడిపించటం కాదు. ఏడిపించలేరు. శరీరాన్ని ఇనుప గొలుసులతో బంధించినా మనసును ముట్టుకోలేరు. దానిని శాసించలేరు. దాని మార్గాన అది యధేచ్ఛగా ఎగిరిపోతుంది. మీకు మిగిలేది యంత్రం....కట్టె...శవం...."

శేఖర్ ముఖం ఒక క్షణం పాలిపోయింది. మరుక్షణం జేవురించింది.

"అలాగేం? ఎగురుతుందా మనసు? ఎగరనీ! ఎగిరి ఎగిరి అదే నామరూపాలు లేకుండా పోతుంది. నాకు మిగిలేది యంత్రమే అయినా ఫరవాలేదు. ఆ యంత్రాన్ని ఎలా నడిపించుకోవాలో నాకు తెలుసు!"

భగ్గుమంది రాధకి...

"కాదు! నేను యంత్రాన్నికాను. మీరు నన్ను ఆడించలేరు. నేను మనిషిని. నా మనసు చెప్పినట్లే వింటాను. మీరు నన్నేమీ చేయలేరు."

పిచ్చిదానిలా వీధిన పడింది రాధ. హాస్పటల్‌లో కరుణ్ మంచం దగ్గిర వాలింది.

కరుణ్‌కిఅప్పుడప్పుడే స్పృహ వస్తోంది. అస్పష్టంగా"రాధా!" అని కలవరిస్తున్నాడు.

అక్కడ కరుణ్ బంధువులంతా....లోకం దృష్టిలో అతనికి కావలసిన వాళ్ళందరూ వున్నారు. అయినా అతడు రాధను....ఎవరి కారణంగా తనీ దశకు రావలసి వచ్చిందో ఆ రాధను....కలవరిస్తున్నాడు.

అతని బెడ్‌మీద అతని పక్కనే కూలబడిపోయింది రాధ. నిలబడ గలిగేశక్తి తనకేమీ మిగలనట్లు....

"నేను వచ్చేసాను కరుణ్!" అంది. ఉత్సాహంగా కాదు.... ఆనందంగా కాదు....మొండిగా.

కరుణ్ పూర్తిగా కళ్ళు తెరిచాడు. "రాధా!" అన్నాడు పట్టరాని ఆశ్చర్యంతో...."రాధా!" అన్నాడు మళ్ళీ అంతులేని భయంతో.

"అవును! రాధను!" నవ్వింది కన్నీళ్ళ మధ్య.

ఆ నవ్వు చూసిన కరుణ్ ముఖంలోకి జీవం వచ్చింది.

"నిన్నొక్కసారి....చివరిసారి .... చూడకుండా చచ్చిపోతానేమోనని, ఎంత అలమటించా ననుకున్నావ్? ఎలాగైనా నువ్వొక్కసారి కనిపించాలని తెలిసిన దేవుళ్ళందరినీ ప్రార్థిస్తున్నాను. నిన్ను చూసాను; సంతోషంగా చచ్చిపోతాను."

రాధ పెదవులు వణికాయి. ఆపుకోరాని దుఃఖం పొంగి వస్తోంది. అంత దుఃఖాన్నీ వెనక్కునెట్టి అల్లరిగా నవ్వింది.

"మరే పాపం! ఎంతాశ! ఒంటరిగా చచ్చిపోదామనుకున్నావా? ఈ లోకంలో నీతో కలిసి రాలేకపోయినా పైలోకాలకు నీతో కలిసి రావాలనే వచ్చాను. ఎప్పుడో మరి, ముహూర్తం నువ్వే నిర్ణయించు!"

"అదిమాత్రం పాపం కాదా?"

"కాదు! అక్కడ శరీరాలుండవు. మనసులే! అంతాగాలి! గాలి: ఏబంధాలూ లేనిగాలి!" పకాలున నవ్వాడు కరుణ్.

"లాభం లేదు! ఇలా మాట్లాడగలిగే నిన్ను వదిలి....నిన్ను చూడగలిగే నా శరీరాన్ని వదిలి గాలిగా ఎగిరి పోలేను. ధూ!.... పినా ఇక్కడేవుంటాను!" అన్నాడు.

"ఛా! ఛా!"

గిర్రున తల తిప్పింది రాధ. అయోమయంగా చూసింది. ఛీత్కారంచేసింది స్వర్ణ. ఆ ఛీత్కారం భూనభోంతరాలు నిండి... మంతా ప్రతి ధ్వనించింది. ఆ తాకిడికి తప్పించుకోలేని రాధ... శానికి కృంగిపోయింది.

"అక్కా! నా కంటిలో మెల్లవుంది. ఆయన నా అ... నన్ను చేసుకున్నారంటావా?" అంటే,

"ఛ! కరుణ్‌ని నువ్వు మాత్రం అర్థం చేసుకోలేదా? ... వున్నంతమాత్రాన తేలిగ్గా చూస్తాడానిన్ను? అసలు నువ్వంటే ... అంతులేని ప్రేమ" అని ధైర్యం చెప్పిన రాధ.

"నే నేమీ చదువుకోలేదు. ఆయనకు తగిన భార్యను కానేమో" అని బెంగపడితే,

"భార్య కావటానికి కావలసింది చదువుకాదు. మనసు ... ప్రేమ. అది నీకు పుష్కలంగా వుంది. కరుణ్‌కి నీ కంటె ... భార్య ఈ జన్మకు కాదుకదా, కోటిజన్మలకు కూడా దొరకదు." ఆత్మవిశ్వాసం కలిగించిన రాధ,

ఆ రాధ ఈ రాధేనా? విభ్రాంతితో చూసింది స్వర్ణ.

రాధ, తనరాధ, తన బాబుకి తల్లి ఈ నాడు తన కళ్ళముందు మరొకరి పక్కమీద సంభవమా? రగిలే మనసుతో - రక్తం కక్కే కళ్లతో చూసాడు శేఖర్.

రాధ.... పాపం రాధ.... భర్తనూ, సంపదనూ, సంసారాన్ని వొదిలి సంఘాన్నెదిరించి సంఘర్షణలకు తట్టుకొని తనకోసం తన దగ్గిరకు వచ్చేసిన రాధ.

ఆరాధన నిండిన చూపులతో అభిషేకించాడు కరుణ్. రాధ అలాగే కూచుంది. పాతాళంలోకి దిగిన తన తలను పైకెత్తలేదు. ఎవరినీ చూడలేదు. ఏదీ ఆలోచించలేదు. కట్లతో నిండిన కరుణ్ చెయ్యి గట్టిగా పట్టుకుని కదలకుండా కూచుంది.

సమయానికి వెంటనే హాస్పిటల్‌కి చేర్చటంవల్ల సమర్థులైన వైద్యులతో వైద్యం చేయించటంవల్ల త్వరలోనే కోలుకున్నాడు కరుణ్. ఆ ఖర్చంతా శేఖర్ భరించాడని తెలిసింది. రాధ మనసు చల్లబడలేదు. మరింత మండింది. ఏదో సిల్లీగా ఫీలయినపుడు కాని, శేఖర్ ఇలా ప్రవర్తించడు. ప్రాణాలకు మోసం వచ్చేలా తన్నించి ఆ తరువాత వైద్యం చేయించటమా ఔదార్యం?

హాస్పిటల్‌కువచ్చిన రాధ మళ్ళీ తన ఇంటికి వెళ్ళలేదు. శేఖర్ ఒకటి రెండుసార్లు వచ్చాడు. రాధ తలఎత్తి చూడలేదు. కరుణ్‌కు నయమయ్యాక అతనితో అతని ఇంటికివచ్చింది. స్వర్ణ రెండేళ్ళ తన కూతురిని తీసుకుని పుట్టింటికి వెళ్ళిపోయింది.

కల్నల్ స్వామి వచ్చారు.

"రాధా! నువ్వుచేసినపని నాకు నచ్చలేదు!" సూటిగా అన్నాడు.

"నీకు నచ్చాలని నేను చెయ్యలేదు." నిర్లక్ష్యంగా అంది రాధ.

తనను విమర్శించే వ్యక్తులతో నిర్లక్ష్యంగా మాట్లాడటం నేర్చుకుంటుంది రాధ.

"ఛ! ఛ! ఏది జరగకూడదని ఎంతచేసానో, చివరకు అదే జరిగింది!"

"ఏమిటి నువ్వు మాట్లాడేది!"

కసిగా పళ్ళు నూరాడు స్వామి.

"ఆ కరుణ్‌గాడిని చావతన్నిస్తే మళ్ళీ నీ జోలికి రాడనుకున్నాను. కానీ,....ఏడవండి! వినాశకాలే విపరీతబుద్ధిః."

స్వామి మాటలు వినపడటంలేదు రాధకి. ఆవిడ తల తిరుగుతోంది: గూండాలతో కరుణ్‌ని తన్నించింది శేఖర్‌కాదు! స్వామి! మరి శేఖర్ ఎందుకంత శ్రద్ధతీసుకుని వైద్యం చేయించినట్టు? అంతటి ఉదార స్వభావంకాదే!

శేఖర్ వచ్చాడు. తనంతట తాను తన భార్య మరొకరితో ఉంటోన్న ఇంటికి వచ్చాడు. అతని ముఖం బాగావడిలి ఉంది. తలెత్త లేదు రాధ.

"ప్లీజ్ రాధా! రెండు నిముషాలు! మళ్ళీ నిన్ను డిస్టర్బ్ చెయ్యను."

బెదిరిపోతున్న చూపులతో చూసింది రాధ....

"జరిగినదానికి చాలా విచారిస్తున్నాను. ఎలా జరిగిందో నాకు అర్థం కావటంలేదు. కానీ భయంకరమైన నా కోరిక అనుకోకుండా కార్యరూపం దాల్చింది....ఈర్ష్య అణచుకోలేక కరుణ్‌ని చావతన్నాలని నాలోనేను ఎన్నోసార్లు అనుకున్నాను. వంటినిండా గాయాలతో హృదయ విదారకంగా మూలుగుతూ మంచాన పడిన అతణ్ని ఊహించుకుని కసిగా నవ్వుకున్నాను. కానీ తీరా అతణ్ని అలా చూడగానే ఎందుకో వణికిపోయాను. నేను అంతగాఢంగా కోరుకోవటమే అలా జరగటానికి కారణమేమో అనిపించింది. అందుకే వైద్యం చేయించాను. త్యాగబుద్ధితో కాదు. అంత ఔదార్యం నాకు లేదు. ఇప్పటికీ అతనంటే నాకు ఈర్ష్య....అంతులేని ఈర్ష్య...."

ఆగాడు శేఖర్, కరుణ్‌ని తలుచుకోగానే కలిగిన ఉద్రేకం నిగ్రహించుకోవటానికి....

ఏమీ మాట్లాడలేదు రాధ. శిలలా కూచుంది.

"ఇదిగో! ఇది నీకు ఇయ్యటానికి వచ్చాను...." చెయ్యి ముందుకు జాపాడు.

లేత పసుపు పచ్చరాయి పొదిగిన వుంగరం! ఒకనాడు ఎంతో ప్రేమతో తనే స్వయంగా అతని వేలికి తొడిగిన వుంగరం.

"ఇంక నా దగ్గిర అది అనవసరం! నీకే ఎందుకైనా ఉపయోగ పడవచ్చు!"

---

# 'మీసాల కథ'గా

## మరో కార్టూన్ కథ

## రాబోయే పేజీలలో!

---

మొదటి వాక్యానికి కరిగి పోబోయిన రాధ మనసు రెండో వాక్యంతో పదునెక్కింది. ఆ వుంగరం తీసుకుంది. శేఖర్ వెళ్ళిపోయాడు.

కరుణ్ కూతురు బాల వచ్చీరాని మాటలతో ఎప్పుడు కరుణ్ చుట్టూ తిరుగుతూ అతనిని వదిలి పెట్టేది కాదు.

స్వర్ణ వెళ్ళిపోయినందుకు కరుణ్ బాధ పడక పోలేదు. కానీ బాలను చూడకుండా వుండలేక పోయాడు. బాల కోసం అభిమానం చంపుకుని, అవమానాలకు సిద్ధపడి, అత్తవారింటికి వెళ్లాడు. అత్తమామలు అతణ్ని చూసి కూడా పలకరించ లేదు. స్వర్ణ గదిలోకి వెళ్ళబోయాడు కరుణ్. గది గుమ్మానికి అడ్డుగా నిలబడింది స్వర్ణ. కదల లేదు. కరుణ్‌ని లోపలకు రమ్మన లేదు. కూర్చోమన లేదు. ఆ ధోరణి అర్థం చేసుకున్నాడు కరుణ్.

"బాల ఏది?"

"కిటికీలోంచి మీరు రావటం చూసాను. పని మనిషితో బయటకు పంపించాను."

"అంటే?"

వెటకారంగా నవ్వింది స్వర్ణ.

"చదువుకున్న వారు మీరు! నాలాంటి మూర్ఖురాలు ఇంత కంటె ఏం చెప్పగలదు?"

తనే ఒక కుర్చీ తెచ్చుకు గది బయటే కూర్చున్నాడు కరుణ్. స్వర్ణ అలా నిలబడే వుంది.

"పిలిపించు?" అన్నాడు అధికారికంగా.

"ఎందుకూ? అది వి మ్మల్ని ఎంత త్వరగా మరిచిపోతే నా కంత మంచిది."

"నన్ను పూర్తిగా వదు ుకున్నట్లేనా?"

"జాగ్రత్తగా మాట్లాడం డి! మీరే నన్ను వది ారు. నేను దేవిరించటం లేదు!"

"ఆలోచించే మాట్లాడు న్నావా?"

"ఏవిటీ? మీరు....నన్ను ఆలోచించమంటున్నారా? ఆహా! ఆలోచించాను. అన్ని విషయా ా చాలా బాగా ఆలోచించుకున్నాకే ఈ నిర్ణయానికి వచ్చాను. మొ ఏడు లేనంత మాత్రాన నాకు మునిగి పోయింది లేదు. కనుసైగ చే ే చాలు కుక్కల్లా వచ్చి క్యూలో నిల బడతారు. మిమ్మల్ని మించిన ప్రణయోపాసకులు!"

"ఛీ! ఛీ! ఎంత దారుణ గా మాట్లాడుతున్నావ్ మా ప్రేమను అర్థం చేసుకోకుండా."

"కాదు! కాదు! అర్థం చేసుకున్నాను లైలా మజ్నూలను, పార్వతీ దేవదాసులను, అనార్కలీ సలీంలను, ఇంకా ాలాటి వాళ్ళం దరినీ మించిపోయిన పవిత్రప్రేమ. అలాటి పవిత్రప్రేమ నాకు లేదు. నా సంసారాన్ని కూలదోసుకు ప్రేమ....నా బిడ్డ బ్రతుకును నలు గురిలో నవ్వులపాలు చేసుకునే ప్రేమ....అలాటి ప్రేమ నా కక్క ర్లేదు. ఆ మహా ప్రణయోపాసకులు మీరే! మీ యశస్సు భూనభోంత రాళాలు నిండి జ్వలించి పోతుంది. ఆ జ్వాలల్లో ా పాపమాడి పోకుండా కాపాడుకోవటమే ాకు కావాలి! నా పాపం దుట్టూ కంచు కోటలా నిలవటానికి ఏదైనా వద ుకుంటాను. ఎంతైనా సహిస్తాను."

స్వర్ణ మాటల్లో నిర్లక్ష్యం మాత్రమే తెలిసింది కరుణ్‌కు. ఆ తరువాత ఆమె కిటికీ చువ్వలు పట్టుకుని తను కను మరుగయ్యేంత వరకూ చూడటం తెలియదు. భరింపరాని బాధతో బికిన ఆమె కన్నీరు, దానిని వెన్నంటి వచ్చిన రోషాగ్ని కీలల్లో ఆవిరికావటం తెలియదు.

కరుణ్ ముఖం చూడగా ఏదో జరగరానిది జరిగిందని అర్థం చేసుకుంది రాధ. కానీ, అదేమిటని అడగలేకపోయింది. ఏం జరిగినా కారణం తనే! "నీ వల్ల నా అవమానం జరిగింద 'ని కరుణ్ చెప్పడు.

గంగా భాగీరథీ సమానురాలు సుబ్బాయమ్మగారు. అక్కడి మాట లిక్కడా, ఇక్కడిమాట లక్కడా జేరవెయ్యటంలో, లేనివి కల్పించి చెప్పటంలో, పని కట్టుకుని మనసుని పొడిచేలా మాట్లాడ టంలో ఆవిడ కావిడే సాటి.

రెండు గంటలవేళ గుండె బాదుకుంటూ వచ్చింది ఆవిడ రాధ దగ్గిరకి.

"ఇంకేముంది రాధమ్మ తల్లీ! అంతా ముగిసిపోయింది, నా తల్లీ! శేఖర్ చచ్చిపోయాడు రా మ్మా!" అని దీర్ఘాలు తీసేస్తోంది.

అదిరి పడింది రాధ.

"శేఖర్ చచ్చిపోయాడా? నిన్నటివరకూ బాగానే వున్నాడు?"

"నిన్నటివరకూ కాదే నా తల్లీ! గంట క్రిందటివరకూ బాగానే వున్నాడు. ఇప్పుడే కారు ఏక్సిడెంట్ అయింది. శేఖర్‌కారు లారీని గుద్దేసింది. నా కళ్ళారా చూసాను."

రక్తం బొట్టులేనట్లు పాలిపోయింది రాధ ముఖం. ఆ ముఖం చూసి తృప్తిపడిన సుబ్బాయమ్మ దీర్ఘాలు ఆపేసింది. స్థిమితంగా మాట్లాడటం మొదలుపెట్టింది.

"అవునే అమ్మాయ్! ఇంతకూ నీకు పసుపుకుంకం పోయి నట్లా? ఉన్నట్లా?" అని ధర్మసందేహం ప్రకటించింది.

రాధ చీదరగా చూసి కోపంగా ముఖం తిప్పుకోవటంతో ఆవిడకు హుషారొచ్చింది. మరి కాస్త రసవత్తరంగా మళ్ళీ మొదలు పెట్టింది.

"ఇది విన్నావా? అది ఏక్సిడెంట్ కాదనీ, శేఖర్ కావాలనే తన కారును లారీకి గుద్దించాడనీ చెప్పుకుంటున్నారు. ఏం కాలమమ్మా! చావడానిక్కూడా కొత్తకొత్త మార్గాలు! భలే! భలే!" అని కొంత సేపు తన హుషారు ప్రకటించిన సుబ్బాయమ్మ అంతలో అసలు విషయం గుర్తొచ్చి విచారంగా "అవునమ్మా! హాయిమన్న మొగ మహారాజు కట్టుకున్న పెళ్ళాం కళ్ళముందు మరోడితో కాపురం చేస్తోంటే ఎలా సహిస్తాడు? ఆ నరకంకంటె ఈ చావు మేలుకాదు మరీ...." అని వ్యాఖ్యానించింది.

రాధ ముఖ భంగిమలు చూడాలని ముచ్చటపడి పరిశీలనగా చూసింది. కానీ అప్పటికే రాధ స్పృహతప్పి పడిపోయింది. సుబ్బా యమ్మ కంగారుపడి పారిపోయింది.

కరుణ్ వచ్చేసరికి రాధ అలాగే స్పృహతప్పి పడివుంది. ఆరేళ్ళ బాబు బిక్కుబిక్కుమంటూ చూస్తున్నాడు. కరుణ్‌కి మతి పోయినట్లయింది.

"రాధా! రాధా!" అని పిలిచాడు. ముఖంమీద చన్నీళ్ళు జల్లాడు. స్మెల్లింగ్ సాల్ట్ వాసన చూపించాడు. రాధ కళ్ళు తెరిచింది. కరుణ్ కనిపించాడు. అంతలోనే ఎక్కడినుంచో శేఖర్ స్వరం మన సును మెలిపెడుతూ వినిపించింది.

"నిన్ను ప్రేమిస్తున్నాను రాధా! నిన్ను వదలను రాధా! వద లను....వదలను....నిన్ను వదలను...."

రాధ మళ్ళీ స్పృహ తప్పిపోయింది. బాబు ఏమీ అర్థంకాక వెక్కివెక్కి ఏడ్చేసాడు. కరుణ్ బాబును దగ్గిరకు తీసుకోవాలని ఒక్క అడుగు ముందుకు వేసాడు. బాబు వెనక్కు తగ్గాడు. కోపంగా చూసాడు. అమాయకంగా అన్నాడు.

"డాడీ ఉంటే మమ్మీని ఇలా పడిపోనియ్యరు!"

గతుక్కుమన్నాడు కరుణ్. అమాయకంగా ఆ పసివాడి నోట వచ్చిన ఆ మాట సార్వజనీన జీవిత సత్యమా? సమకాలీన సాంఘిక సత్యమా? లేక ఈ రెంటినీ అనుసంధించే అద్భుత సమన్వయమా?

ఎప్పటికో కళ్ళు తెరిచింది రాధ. ఎదురుగా శేఖర్. ఒక్క సారిగా రాధ ముఖం వికసించింది. ఆ వికాసం చూసిన శేఖర్ ముఖమూ వికసించింది. శేఖర్ భుజంమీద వున్న బాబు ముఖమూ వికసించింది.

ఈ లోకంలో మంచిచెడ్డలు లేవు. పాపపుణ్యాలు లేవు. కానీ, ఏ నాటికీ ఎవరూ కాదనలేని అంతరాత్మ మాత్రం వుంది. అపరాధ భావనతో సలిపే అంతరాత్మను పెట్టుకొని జీవించవలసి రావటం నరకాలన్నింటిలో నరకం.

"నువ్వే శేఖర్‌ను చంపావు. ఒక ప్రాణిని పొట్టన పెట్టుకున్నావు. ఒక నిండుజీవితాన్ని బలి తీసుకున్నావు" అని అంతరాత్మ ఘోష పెడుతోంటే.... ఆ ఘోషకు మనసు మొద్దుబారిపోయి సమస్త చైతన్యమూ నశించిపోతోంటే ఎన్నాళ్ళు తనలా పడివుందో? అబ్బ! ఎంత రిలీఫ్!

శేఖర్ చిరునవ్వుతో ఉల్లాసంగా మాట్లాడుతున్నాడు. "స్పృహ లేకుండా నువ్వు ఎన్నాళ్ళు హాస్పిటల్‌లో ఉన్నావో తెలుసా? వారం రోజులు! నా చావు అబద్ధం! నీ చావు నిజం అనుకున్నాను. నేను చచ్చిపోయానని విని, అది తట్టుకోలేక నువ్వు చచ్చిపోతే నేనెలా తట్టుకోగలనురా భగవంతుడా! అనుకున్నాను."

పకాలున నవ్వింది రాధ.

"మనసు చికాగ్గా ఉన్నమీదట ఇలాంటి వార్త వినేసరికి మెంటల్ షాక్ వచ్చిందన్నాడు డాక్టర్.... క్షమించు రాధా? కల్పించుకోవాలని కల్పించుకోలేదు. నీ పరిస్థితి చూశాక, ఆ పరిస్థితికి పరోక్షంగా కారణం నేనని తెలిసాక, నిన్నలా వదిలెయ్యలేక పోయాను."

మధ్యలో ఆగిపోయి అదోరకంగా చూసాడు శేఖర్. ఆ చూపులలో అడగలేని అనేక ప్రశ్నలు

'నీ మనసు చికాగ్గా ఉందా? ఎందుకుంది? అంత చికాగ్గ ఉన్నప్పుడు అక్కడెందుకున్నావు?'—అలాంటి ప్రశ్నలు.

తన మనసు చికాకు పడిందా? తనకు తెలియదు! తను తపించిపోయిన కరుణ్ సాన్నిధ్యం దొరికింది నిజమే! కానీ, వడిలిపోయిన బాబు ముఖం? అది చూడలేకపోయేది. కరుణ్ దగ్గరకు తీయబోయినా, బాబు వెళ్ళేవాడు కాదు. కోపంగా చూసేవాడు. ఆ కోపం పోగొట్టి లాలించి బుజ్జగించి ఆడించే ఓపిక కరుణ్‌కి లేదు. పైపెచ్చు బాబు తిరస్కారం అతని మనసును గాయపరిచేది. ఆ తిరస్కారం ప్రకటిస్తున్నది ఆరేళ్ళ అమాయక ప్రాణి అనే విషయం గుర్తుకు రాలేదు.

తరచుగా బాల ఫోటో ముందు నిలబడి నిట్టూర్పు విడిచేవాడు కరుణ్. రాధను చూడగానే ఏదో తప్పు చేసినవాడిలా వెళ్ళిపోయేవాడు. అపరాధిలా ముడుచుకుపోయేది రాధ.

రాధ హాస్పిటల్‌లో ఉండగా కరుణ్ కూడా వచ్చేవాడు. శేఖర్ ఏమీ మాట్లాడేవాడు కాదు కాని, అతడు రాగానే లేచి వెళ్ళిపోయేవాడు. రాధ ఎవరితోనూ ఏమీ మాట్లాడేది కాదు. నీరసంగా ఉన్నట్లు కళ్ళు మూసుకుని పడుకునేది.

రాధ పూర్తిగా కోలుకుంది. మరునాడు వెళ్ళిపోవచ్చునని డాక్టర్ చెప్పాడు.

"రాధా!" దీనంగా పిలిచాడు శేఖర్.

ఏమిటన్నట్లు చూసింది రాధ.

"మన కంపెనీ హెడ్డాఫీస్ బెజవాడకు మార్చి దీనిని బ్రాంచీగా చేసాను. బెజవాడకు వెళ్ళిపోవాలనుకుంటున్నాను."

రాధ మాట్లాడలేదు.

"నువ్వూ వస్తావా రాధా!"

ఉలికిపడింది రాధ. అభిమానానికీ, పౌరుషానికీ మారుపేరయిన శేఖర్ ఇలా దీనాతిదీనంగా ప్రాధేయపడుతున్నాడు.

"ప్లీజ్ రాధా! బాబుకోసం!"

కళకళలాడుతూ కేరింతలు కొడుతూ తండ్రి మెడచుట్టూ చేతులువేసిన బాబును చూసింది రాధ.

అలా వాడి ముఖం చూసి ఎన్నాళ్ళయిందో?

దిండులో ముఖం దాచుకుంది. దిండులోంచే అంది.

"వస్తాను."

రాధ మనసు ఏ క్షణంలో ఎలా మారుతుందో అన్నట్లు చకచక ప్రయాణపు ఏర్పాట్లు పూర్తిచేసాడు శేఖర్.

బయలుదేరే రోజు వచ్చింది.

"నన్నొక్కసారి స్వర్ణదగ్గిరకి తీసికెళ్తారా?" అని అడిగిందిరాధ.

ఉలికిపడ్డాడు శేఖర్.

"స్వర్ణ దగ్గిరకా?"

"అవును."

"అలాగే!"

"ఒక మంచి పట్టుచీర, దానిమీదికి జాకెట్ కూడా తీసుకురండి!"

"అలాగే!"

అన్నింటికీ 'అలాగే!' అంటోన్న శేఖర్‌ను చూస్తే జాలేసింది రాధకి. భరించలేనట్లు తల తిప్పుకుంది.

కారులో దిగిన శేఖర్ దంపతులను చూసి తెల్లబోయారు స్వర్ణ తలిదండ్రులు. సంభ్రమంతో గౌరవంగానే ఆహ్వానించారు.

స్వర్ణ వచ్చింది. కొయ్యబొమ్మలా నిలబడింది. తలఎత్తి స్వర్ణను చూడటానికీ,మాట్లాడటానికీ శక్తినంతా కూడదీసుకుంది రాధ.

"స్వర్ణా! నేను వెళ్ళిపోతున్నాను.... ఇది.... నీకు బొట్టుపెట్టి ఇయ్యాలని వచ్చాను."

రాధ లేచింది. స్వర్ణకు బొట్టుపెట్టి పట్టుచీర చేతిలో పెట్టింది.

"వెళ్ళొస్తానమ్మా!" అంది.

అకస్మాత్తుగా స్వర్ణ రాధను కౌగిలించుకుని బావురుమంది. చెమ్మగిల్లిన కళ్ళతో స్వర్ణ భుజం తట్టింది రాధ.

ఎప్పటినుండో కరుణ్ రోడ్డుమీద పడిగాపులు పడుతూ నిల్చున్నాడని తెలుసు. అయినా అటు తల తిప్పలేదు. అతని నొక్కసారి కూడా చూడలేదు.

బాబు చెయ్యి పట్టుకుంది. కారులో వచ్చి కూచుంది. కారు కదిలింది.

ఈ దరినుండి పొంగుతున్నది.

స్వరాలకు లొంగని, శ్రుతులకందని మోహనగానరవళి ఆ దరి నుండి వినవస్తున్నది.

అద్భుత స్వర సమ్మేళనంలో శ్రుతిబద్ధమైన ప్రణవనాద మాధురి.

ఈ ఆద్యంతాల నడుమ ఉయ్యాల లూగుతున్నది చైతన్యం.

ప్రాణుల ప్రణయలాస్యాలతో. ప్రళయ హాస్యాలతో.

ఇదే నిరంతర మధుర విషాద గీతి. విశ్వ గీతి. ★★★